క్లుప్తంగా

బిజీగా బీఎల్‌ఓలు

భామిని: మండలంలోని 44 పోలింగ్ బూతుల పరిధిలో ఓటర్ల జాబితాలలో తేడాలు సరిచేసి సమర్పించడంలో బూత్‌లెవల్ అధికారులు తలమునకలైయ్యారు. బీఎల్‌ఓలతో సోమవారం తహసీల్దార్ కార్యాలయం కిక్కిరిసింది. తహసీల్దార్ నీలాపు అప్పారావు, డీటీలు నిమ్మల శేఖరం, రమేష్‌కుమార్, ఆర్‌ఐ ఎస్.రాంబాబు బీఎల్‌ఓలకు సహకరించారు.

కుక్కకాటుతో పలువురికి గాయాలు

గుమ్మలక్ష్మీపురం: కుక్కకాటు బారినపడి పలువురు గాయపడిన ఘటన మండలంలో సోమవారం చోటుచేసుకుంది. కేదారిపురంలో పసుపురెడ్డి పవిత్ర, పసుపురెడ్డి దివ్యశ్రీ, కొసగూడలో ఆరిక నందు, కురుపాం మండలంలోని జొంగరపాడులో మండంగి టుంబు, మూటక గాంధీలు గాయపడ్డారు. వీరిని వారి వారి గ్రామాల్లోని కుక్కలు దాడిచేయడంతో గాయపడగా, వైద్యసేవల నిమిత్తం వారంతా భద్రగిరి పీహెచ్‌సీలో చేరారు. వైద్యసిబ్బంది వారికి వైద్యం అందించారు.

టీకా కార్యక్రమం బలోపేతం చేయాలి

• డీఎంహెచ్‌ఓ బి.జగన్నాథరావు

పార్వతీపురంటౌన్:టీకా కార్యక్రమం బలోపేతం చేసే దిశగా శిక్షణ సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్‌ఓ బి.జగన్నాథరావు అన్నారు. ఈ మేరకు స్థానిక ఎన్‌జీఓ సమావేశ భవనంలో వైద్యాధికారులకు టీకా కార్యక్రమంపై సోమవారం శిక్షణ నిర్వహించారు. విశాఖ జోన్ నుంచి వచ్చిన డబ్ల్యూహెచ్‌ఓ బృందం పవర్‌ప్రెజెంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణలో డాక్టర్ జగన్నాథరావు పాల్గొని పలు సూచనలు చేశారు. టీకా కార్యక్రమానికి సంబంధించి వైద్య, ఆరోగ్య శాఖ సూచిస్తున్న మార్గదర్శకాలను కచ్చితంగా పాటించి క్షేత్రస్థాయిలో అమలు జరిగేలా చూడాలని సూచించారు. వ్యాక్సిన్ నివారిత వ్యాధులు నియంత్రణకు ప్రభుత్వం పటిష్టంగా కృషి చేస్తుందని తెలిపారు. ముఖ్యంగా తట్టు, రుబెల్లా వ్యాధులు ప్రబలకుండా శతశాతం వ్యాక్సినేషన్ జరగాలని చెప్పారు. ఓపీ నిర్వహణలో దద్దుర్లతో కూడిన జ్వరం, ఏఎఫ్‌పీ సమస్యలతో ఉన్న వారిని గుర్తించి వెంటనే సంబంధిత పోర్టల్‌లో నమో దు చేయాలని కోరారు. పిల్లలకు షెడ్యూల్ ప్రకారం టీకాలు వేయాలని, డ్రాపౌట్స్, లెఫ్ట్ అవుట్స్‌ను గుర్తించాలని కోరారు. టీకా మార్గదర్శకాలను పాటించి యువిన్ పోర్టల్‌లో నమోదు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఐఓ డాక్టర్ నారాయణరావు, డీఎంఓ డాక్టర్ టి.జగన్ మోహన్‌రావు, డీఎల్‌ఏటీఓ శ్యామ్‌కుమార్, డబ్ల్యూహెచ్‌ఓ ఎస్‌ఎంఓ జాన్‌జూడ్ జాషువా పాల్గొన్నారు.

పనుల ప్రణాళికలో వార్డు మెంబర్లు కీలకమే



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ రవికుమార్

బలిజిపేట: పంచాయతీ వార్షిక సంవత్సరానికి సంబంధించిన పనుల ప్రణాళిక తయారుచేసేటప్పుడు పంచాయతీ వార్డు మెంబర్లు కీలక పాత్రధారులేనని జెడ్పీటీసీ ఎ.రవికుమార్ అన్నారు. ఈ మేరకు బలిజిపేట ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ విజయలక్ష్మి ఆధ్వర్యంలో వార్డు మెంబర్లు, వీఓఏలతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనుల ప్రణాళిక తయారుచేసేటప్పుడు గ్రామస్థాయిలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో పాటు వార్డు మెంబర్లు పంచాయతీలకు అవసరమైన పనులను ప్రతిపాదనలు చేయాలని సూచించారు. నాయకులతో చర్చించి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. మంచి పనులను గుర్తించడం వల్ల గ్రామానికి ఎంతో మేలు జరుగుతుందని చెప్పారు. అధికారులు, ప్రజాప్రతినిధులు చర్చించుకోవడం ఎంతో అవసరమని అభిప్రాయ పడ్డారు. ప్రజలకు అవసరమైన పనులను తెలుసుకుని వాటి ప్రతిపాదనలు పెట్టాలని అందుకు వార్డు మెంబర్లకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ పూర్తి చేయాలి

పార్వతీపురంటౌన్: ఆరోగ్యశ్రీ కార్డులను అర్హులందరికీ వెంటనే పంపిణీ పూర్తి చేయాలని జేఏఎస్ జిల్లా పర్యవేక్షణాధికారి, స్టేట్ టీబీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ టి.రమేష్ అన్నారు. డీఎంహెచ్‌ఓ బి.జగన్నాథరావు ఆధ్వర్యంలో ప్రోగ్రాం అధికారులకు సోమవారం నిర్వహించిన సమావేశంలో పలు సూచనలు చేశారు. మండలాలు, సచివాలయాల వారీగా ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ నివేదికలను ఆయన పరిశీలించి ఎక్కువగా పెండింగ్‌లో ఉన్న ప్రాంతాల్లో ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ వేగవంతం చేయాలన్నారు. ఆయా పీహెచ్‌సీల పరిధిలో పర్యవేక్షణ చేయాలని ప్రోగ్రాం అధికారులను ఆదేశించారు. జగనన్న ఆరోగ్యశ్రీ రిఫరల్స్‌కు వెంటనే సంబంధిత ఆస్పత్రిలో చికిత్స పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీతంపేట, పార్వతీపురం డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు డాక్టర్ విజయపార్వతి, డాక్టర్ శివకుమార్, డీఎంఓ డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు, డీఎల్ ఏటీఓ శ్యామ్‌కుమార్, ఏపీడీపీ నోడల్ అధికారి వినోద్‌కుమార్, ప్రోగ్రాం అధికారి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



జియ్యమ్మవలస: అల్లువాడలో పూర్ణకలశాలతో భక్తుల తిరువీధి



కొమరాడ: గంగారేగువలసలో పల్లకీలో ఉత్సవ మూర్తిని ఊరేగిస్తున్న భక్తులు



గరుగుబిల్లి: సీతారాంపురంలో నగర సంకీర్తన



గరుగుబిల్లి: నాగూరులో బాలరాముని శోభాయాత్రలో భక్తులు

జై శ్రీరామ్!

అయోధ్య రామమందిరంలో సోమవారం బాలరాముని ప్రాణప్రతిష్ట పురస్కరించుకుని, రామనామస్మరణ మార్మోగింది. కాషాయ జెండాలు, తోరణాలతో ఆలయ ప్రాంగణాలు, వీధులు మెరిశాయి. ఉదయం నుంచే మందిరాలకు పోటెత్తిన భక్తులు రామనామం జపిస్తూ రాఘవునికి విశేష పూజలు చేశారు. సాయంత్రం ఆర్‌ఎస్‌ఎస్(రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్), వీహెచ్‌పీ(విశ్వహిందూ పరిషత్), హిందూ ధర్మ ప్రచార కమిటీలు, సంఘాల ఆధ్వర్యంలో శోభాయాత్ర అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉత్సవ మూర్తులు, సీతారాముని చిత్రపటాలను వీధుల్లో ఊరేగిస్తూ జైశ్రీరామ్ నినాదాలు చేశారు. ఈ నేపథ్యంలో అంతటా ఆధ్యాత్మిక శోభ సంతరించుకోవడం విశేషం.

–సాక్షి నెట్‌వర్క్



వీరఘట్టం: తెట్టంగిలో రాములవారికి పూజలు చేస్తున్న భక్తులు



భామిని: బిల్లుమడలో సీతారాముల కళ్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు



భామిని: సొలికిరిలో రామాయణం పాత్రలతో కళాకారుల ప్రదర్శన



భామిని: లివిరిలో హోమాదికాలు నిర్వహిస్తున్న వేద పండితులు



పాలకొండ రూరల్: అంపిలిలో అన్నసమారాధన చేస్తున్న భక్తులు

గ్రామపంచాయతీల అభివృద్ధికి సహకరించాలి

గరుగుబిల్లి: గ్రామపంచాయతీల అభివృద్ధికి అందరూ సహకరించాలని, వార్డు మెంబర్ల సహకారం మరింత అవసరమని ఎంపీడీవో జి.పైడితల్లి కోరారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించడంపై వార్డు మెంబర్లు, వైఎస్సార్ క్రాంతి పథం వీవోఏలకు ఇచ్చే శిక్షణ కార్యక్రమానికి హాజరైన ఆమె పంచాయతీల అభివృద్ధికి ఖచ్చితమైన ప్రణాళికలు తయారు చేయాలని, ఈ ప్రణాళికల ప్రకారం పనులు జరపాలని సూచించారు. ప్రణాళికల రూపకల్పనకు ఇచ్చే ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ ఎల్.గోపాలరావు, ఎంఈవో ఎస్.నాగభూషణరావు, ఏపీవో ఎం.గౌరీనాథ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో పైడితల్లి

ఉద్యానవన సుందరీకరణ పనుల పరిశీలన

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఎస్.కె.పాడు ఉద్యానవన సుందరీకరణ పనులను పార్వతీపురం ఐటీడీఏ పీవో సి.విష్ణుచరణ్ సోమవారం పరిశీలించారు. రూ.60 లక్షల వ్యయంతో క్యాంటీన్, షాపింగ్ కాంప్లెక్స్, టాయిలెట్స్, ఇంటర్నల్ రోడ్లు, పార్కింగ్, ముఖద్వారం నిర్మాణాలు చేస్తుండడంతో పాటు రూ.35 లక్షల వ్యయంతో పర్యాటకుల రాత్రిబస కోసం డార్మిటరీలు, రూ.10 లక్షల వ్యయంతో చెరువు వద్ద బోటుషికారు ఏర్పాటుకు పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ప్రస్తుతం ఈ పనులు చివరి దశకు చేరుకున్నాయి. మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా కొనుగోలు చేసిన సామగ్రిని కూడా పీవో తనిఖీ చేశారు. పెండింగ్ పనుల పూర్తిలో జాప్యం లేకుండా చూడాలని ఇంజినీరింగ్ శాఖ అధికారులను సూచించారు. అనంతరం పీవో విలేకరులతో మాట్లాడుతూ మరో వారం రోజుల్లో ఇప్పటివరకు పూర్తి చేసిన అభివృద్ధి పనులు ప్రారంభించి, పర్యాటకులకు ఉద్యానవన సందర్శనను చేరువచేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇక్కడ నిర్మిస్తున్న క్యాంటీన్, షాపింగ్ కాంప్లెక్స్‌ల నిర్వహణను వేలంపాట ద్వారా కేటాయిస్తామని, ఆసక్తి ఉన్న వారు ఐటీడీఏ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు. ఆయన వెంట గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ శాఖ ఈఈ జె.శాంతీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఉద్యానవన అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో విష్ణుచరణ్

ఓటర్ల తుది జాబితా విడుదల

సీతంపేట: పాలకొండ నియోజకవర్గంలోని ఓటర్ల తుది జాబితాను ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కల్పనాకుమారి సోమవారం విడుదల చేశారు. మొత్తం ఓటర్లు 1,93,667లు కాగా వారిలో పురుషులు 94,328, మహిళలు 99,325, ట్రాన్స్ జండర్లు 14 మంది ఉన్నారు. కొత్తగా 11,826 మంది ఓటు హక్కు నమోదు చేసుకున్నారన్నారు. ఓటర్ల జాబితాలో ఉన్న తప్పులను సరిదిద్దామన్నారు. ఇంకా ఎవరైనా అర్హత ఉండి తమ ఓటు హక్కును నమోదు చేసుకోని వారు ఉంటే వెంటనే నమోదు చేసుకోవచ్చన్నారు. అనంతరం వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశమయ్యారు. ఓటర్ల జాబితాను పూర్తి పారదర్శకంగా రూపొందించినట్లు తెలిపారు. అన్ని తప్పులను సరిదిద్దినట్లు చెప్పారు. ఎక్కువ సంఖ్యలో కొత్త ఓటర్లను నమోదు చేయించామన్నారు.



పీఓ కల్పనాకుమారి

పద్య నాటక పోటీలో రాజారావు ప్రతిభ

భామిని: హిరమండలంలో చీమకుర్తి నాగేశ్వరరావు కళాపీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి పౌరాణిక పద్య నాటక, రంగస్థల పోటీలల్లో భామిని మండలం సొలికిరికి చెందిన రంగస్థల కళాకారుడు కొత్తకోట రాజారావు ద్వితీయ స్థానం సాధించాడు. తెలంగాణ రాష్ట్ర ఎమ్మెల్సీ, జానపద వాగ్గేయకారుడు గోరేటి వెంకన్న చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా రాజారావును జేసీఎస్ మండల కోఆర్డినేటర్ కొత్తకోట చంద్రశేఖర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కొత్తకోట ఆంజనేయులు, పలువురు కళాకారులు అభినందించారు.



గోరేటి వెంకన్న చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న రాజారావు

నిరంతరం ఆదాయం వచ్చే పంటలు వేసుకోవాలి



ప్రకృతి వ్యవసాయంలో భాగంగా లక్కగూడలో వేసిన పంటలు పరిశీలిస్తున్న మండల వ్యవసాయాధికారి ప్రసాద్

గుమ్మలక్ష్మీపురం: నిరంతరం ఆదాయం వచ్చే పంటలు వేసుకోవాలని, దీనికోసం ప్రకృతి వ్యవసాయ విధానంలో రూపొందించిన ఏటీఎం మోడల్‌ను అనుసరించాలని మండల వ్యవసాయాధికారి సీహెచ్ ప్రసాద్ రైతులకు తెలిపారు. మండలంలోని లక్కగూడ గ్రామ రైతులు ప్రకృతి వ్యవసాయ విధానాలు అనుసరిస్తూ సాగు చేస్తున్న పంటలను ఆయన సోమవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం విధానాల ద్వారా పంటలు పండిస్తే ఆరోగ్యవంతమైన పంట చేతికి రావడంతో పాటు అధిక దిగుబడి కూడా వస్తుందన్నారు. ఆయన వెంట అగ్రికల్చర్ అసిస్టెంట్ కె.అర్జునరావు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది గణేష్‌చంద్ర, కె.భూషణరావు తదితరులు ఉన్నారు.

సమ్మె వీడి విధుల్లో చేరిన అంగన్‌వాడీలు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని భద్రగిరి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని ఇద్దరు అంగన్‌వాడీ కార్యకర్తలు, మరో ఇద్దరు ఆయాలు సమ్మె వీడి, సోమవారం విధుల్లో చేరినట్లు ఐసీడీఎస్ పీవో సుశీలదేవి తెలిపారు. అంగన్‌వాడీలంతా తమ డిమాండ్ల పరిష్కారానికి 40 రోజులుగా సమ్మె చేస్తుండగా, విధుల్లో చేరని వారి ఖాళీల భర్తీకి ఈ నెల 25వ తేదీన నోటిఫికేషన్ జారీ చేస్తున్నట్లు ప్రకటించడంతో వీరు విధుల్లో చేరుతున్నట్లు తెలిపారని ఆమె అన్నారు.

40 మద్యం సీసాలు స్వాధీనం

పాలకొండ రూరల్: మండలంలో అంపిలి గ్రామినికి చెందిన వారణాశి మణికంఠ అక్రమంగా మద్యం సీసాలు తరలిస్తుండగా స్థానిక పోస్టాఫీస్ రోడ్డులో సోమవారం పోలీసులు పట్టుకున్నారు. అతని వద్ద 40 మద్యం క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినటట్లు ఎస్సై హేమంత్‌కుమార్ తెలిపారు.

ఆశ్రమ పాఠశాలలో గిడుగు వర్ధంతి



గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాల వేస్తున్న హెచ్‌ఎం లిల్లీరాణి, తదితరులు

సీతంపేట: స్థానిక గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో వ్యవహారిక భాష పితామహుడు గిడుగు వెంకటరామ్మూర్తి పంతులు వర్ధంతి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. గిడుగు చిత్రపటానికి హెచ్‌ఎం ఎ.లిల్లీరాణి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పార్వతీపురం రూరల్ సీఐ బాధ్యతల స్వీకరణ

పార్వతీపురం టౌన్: పార్వతీపురం రూరల్ సీఐగా కె.రవికుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన ఇప్పటి వరకు రాజాం టౌన్ సీఐగా విధులు నిర్వహించారు. ఇప్పటివరకు రూరల్ సీఐగా విధులు నిర్వహించిన స్వామినాయుడు అనకాపల్లి జిల్లా కె.కోటపాడుకు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా బదిలీపై వచ్చిన నూతన సీఐ రవికుమార్ మాట్లాడుతూ పార్వతీపురం పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు.

గ్రామసభల్లో సంక్షేమ పథకాలపై అవగాహన



సూరంపేట వైద్యశిబిరంలో రోగులను తనిఖీ చేస్తున్న వైద్యులు

సీతానగరం: కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వికసిత్ భారత్ గ్రామసభల ద్వారా ప్రజలకు వివరిస్తూ, ఉచితవైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఈఓపీఆర్డీ కె.కుమారవర్మ తెలిపారు. ఈ మేరకు మండలంలోని సూరంపేటలో సోమవారం వికసిత్ భారత్ జిల్లా కోఆర్డినేటర్ రెడ్డి సింహాచలం ఆధ్వర్యంలో గ్రామసభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో అమలు చేస్తున్న సంక్షేమపథకాల గురించి వివరించారు. గ్రామసభలు నిర్వహించే ప్రాంగణంలో పీహెచ్‌సీ సూపర్‌వైజర్ల పర్యవేక్షణలో ఉచితవైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

గరుగుబిల్లి: ఎరువుల షాపు యజమానులు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని పాలకొండ వ్యవసాయ సహాయ సంచాలకులు కె.రత్నకుమారి హెచ్చరించారు. సోమవారం మండలంలోని సంతోషపురం గ్రామపంచాయతీ, ఖడ్గవలస జంక్షన్‌లోని శ్రీగాయత్రి ఎరువుల షాపులో ఆమె తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఎరువుల నిల్వలు, రికార్డులను పరిశీలించారు. రికార్డుల్లో పేర్కొన్న వివరాలకు, షాపులో ఉన్న యూరియా నిల్వలకు వ్యత్యాసం ఉండడంతో రూ.లక్ష విలువైన యూరియాను సీజ్ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నిర్దేశించిన ధరల కన్నా అధికంగా ఎరువులు విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. దుకాణంలో ధరల పట్టికను అందుబాటులో ఉంచాలన్నారు. రికార్డులు సక్రమంగా నిర్వహించకపోతే షాపు అనుమతులు రద్దు చేయడం జరుగుతుందన్నారు. ఆమె వెంట ఏవో ఆర్.విజయభారతి తదితరులు పాల్గొన్నారు.



ఎరువుల షాపులో రికార్డులు తనిఖీ చేస్తున్న వ్యవసాయ శాఖ ఏడీ రత్నకుమారి

గిరిజన స్పందనకు 40 వినతులు

సీతంపేట: ఐటీడీఏలో ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం ప్రాజెక్టు అధికారి కల్పనా కుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన గిరిజన స్పందనకు 40 వినతులు అందాయి. ఉన్నత చదువులకు ఆర్థిక సాయం చేయాలని నౌగూడకు చెందిన నిరంజన్ వినతి ఇచ్చారు. ఐరపాడుకు చెందిన రామలింగం వ్యవసాయ మోటార్ ఇప్పించాలని, గడబపేటకు చెందిన సింహాచలం అంత్యోదయ కార్డు మంజూరు చేయాలని, కర్రగూడకు చెందిన గోపాల్ కుట్టుమిషన్ ఇప్పించాలని దరఖాస్తులు అందించారు. చిన్నపలియా గ్రామానికి చెందిన సిమన్ తాగునీటి సమస్య పరిష్కరించాలని, కొండపోడు పట్టాలు మంజూరు చేయాలని గూనభద్ర గ్రామస్థుడు వెంకటరావు అధికారులను కోరారు. స్పందనలో ఏపీఓ రోసిరెడ్డి, ఈఈ సింహాచలం, డీడీ అన్నదొర, డిప్యూటీఈఓ లిల్లీరాణి, సీడీపీఓ రంగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న పీఓ కల్పనాకుమారి

సీహెచ్‌సీని సందర్శించిన న్యాయమూర్తి

కురుపాం: స్థానిక సీహెచ్‌సీ(సామాజిక ఆరోగ్య కేంద్రం)ని జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి ఎ.రమేష్ సోమవారం సందర్శించారు. అక్కడి రోగులకు అందిస్తున్న వైద్యసేవలపై సిబ్బందిని ఆరాతీశారు. మందులు, పాముకాటు ఇంజిక్షన్ల నిల్వలను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులను బాగా చూసుకోవాలని, వారికి అవసరమైన సేవలను సత్వరమే అందేలా చూడాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ శోభారాణికి సూచించారు. సేవల్లో అలసత్వం వహించవద్దని, ఆస్పత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆయన వెంట ఆస్పత్రి సిబ్బంది, న్యాయవాదులు ఐ.వాసుదేవరావు, కె.అశోక్ తదితరులు ఉన్నారు.



ఆస్పత్రి సూపరింటెండెంట్ శోభారాణితో మాట్లాడుతున్న న్యాయమూర్తి రమేష్

చురుగ్గా కులగణన సర్వే

కురుపాం: మండల కేంద్రంలో కులగణన సర్వే చాలా చురుగ్గా జరుగుతోంది. నెయ్యిల వీధి మెయిన్‌రోడ్డు, శోభలతాదేవి, ప్రదీప్‌నగర్ కాలనీల్లో సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ నిబంధనల మేర వివరాలు సోమవారం సేకరించారు. ఈ సర్వేతో ఆర్థికంగా వెనకబడిన వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా మరింత న్యాయం చేసే వీలుంటుందని, తద్వారా సామాజిక న్యాయం జరుగుతుందని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కులగణన సర్వే చురుగ్గా చేపడుతున్నారు.



కరుపాం: ప్రదీప్‌నగర్ కాలనీలో కులగణన సర్వే చేస్తున్న సచివాలయ సిబ్బంది

సర్వేలో కచ్చితత్వం పాటించాలి

పాలకొండ రూరల్: కుల గణనలో కచ్చితత్వం పాటించాలని ఎంపీడీఓ డొంక త్రినాథులు గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు సూచించారు. మండలంలోని అంపిలి, అన్నవరం, గోపాలపురం తదితర గ్రామాల్లో కొనసాగుతున్న కుల గణన సర్వేని సోమవారం పరిశీలించారు. కేవలం కులాల వారీగా సభ్యుల సంఖ్య నిగ్గ తేల్చేందుకు ఈ గణన చేపడుతున్నట్లు ప్రజలకు వివరించాలని సూచించారు. అనంతరం అంపిలి గ్రామ సచివాలయాన్ని సందర్శించారు. రికార్డులు సక్రమంగా నిర్వహించాలని, ప్రజలకు జవాబుదారీగా ఉండాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఈఓపీఆర్డీ సూర్యనారాయణ, తదితరులున్నారు.



పాలకొండ రూరల్: అంపిలిలో కుల గణన సర్వేను పర్యవేక్షిస్తున్న ఎంపీడీవో త్రినాథులు

వైఎస్సార్‌సీపీలో చేరిన యువత

పార్వతీపురంటౌన్: రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులైన యువత వైఎస్సార్‌సీపీలో భారీగా చేరుతున్నారని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు సోమవారం పట్టణంలోని 11, 12 వార్డులకు చెందిన యువతకు కండువా కప్పి వైఎస్సార్‌సీపీలోకి ఆయన ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలనకు మెచ్చి పార్టీపై నమ్మకాన్ని ఉంచి పార్టీలో చేరిన వారందరికీ సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు. రానున్న కాలంలో సీఎంగా మళ్లీ జగన్‌మోహన్ రెడ్డిని గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు.